అల్లుడు

యర్రంశెట్టి సాయి

సీతారామయ్యగారింట్లో,వీధివేపు గదిలో
ఓ చాకులాంటి కుఱ్ఱాడు అద్దెకు
దిగాడన్న విషయం ఆ వీధంతా
వ్యాపించిపోయింది. ఆ వార్త విని
కండువా అయినా భుజాన వేసుకోకుండా
నాలుగో ఇంటి శివనాధం పెద్ద పను
న్నట్లు ఆ గది ముందునుంచి అటూ
ఇటూ తిరిగి కుఱ్ఱాడిని ఎక్స్‌రే తీసినట్లు
చూసి తబ్బిబ్బయిపోయాడు.

"అబ్బ! ఏ మందం? ఏ మందం?
అచ్చం సినిమా. యాక్టర్లా ఉన్నాడనుకో!
యమ వర్స నాలిటీ!...అహాహా...
ఓహోహో..." అన్నాడు పెళ్ళాంతో.

"ఉద్యోగం ఏమిటో?" ఆరాగా అడి
గింది ఆయన భార్యారత్నం.

"ఏదో మంచి ఉద్యోగమే అయ్యుం
టుంది. గదిలో చాలాఖరీదయినసామాన్లు
కనిపించినయి. పెద్ద రేడియో, గదంతా
హాంగర్లకి వేలాడుతున్న ఖరీదయిన
బట్టలూ-ఓ టేబులూ, కుర్చీ-చాలా
హడావుడిగానే ఉన్నాళ్ళే..."

"మరి అలాంటప్పుడు...కుల
మేమిటో కనుక్కోని...ఒకవేళ పెళ్ళ
వకపోతే మన అమ్మాయికి చూడరాదు
టండీ?..."

"అవన్నీ కూడా కనుక్కొన్నా

లేవోయ్-వీధి మొదట్లో ఉన్న కిల్లీకొట్లో, సిగిరెట్లు కొనేప్పుడు వాడికి చెప్పొట్ట- తన దసలు విశాఖపట్నం అనీ-ఇంకా వివాహం కాలేదనీ...ఇక కులమంటావూ మన కులం వాళ్ళకి తప్పితే మరొకరికి గది అద్దెకివ్వడుగా సీతారామయ్య..."

"మరింకేం త్వరగా మాట్లాడండి- లేకపోతే ఆ సీతారామయ్య గాలాం వేసేయగలడు,వాడి కూతురుకోసం..." రహస్యంగా అందావిడ.

"నాకు తెలుసులేవే బాబూ!...నేనూ ఆ ప్రయత్నంలోనే ఉన్నాగా! ఈలోగా మనమ్మాయికి మంచి చీరా అదీ కట్టి రెండు మూడు సార్లు, ఆ కుఱ్ఱాడున్న టైములో సీతారామయ్య ఇంటికి ఏదో వంకమీద పంపించు..."

"అవన్నీ మీరు చెప్పాలండీ! మరీనూ..." నవ్వుతూ లోపలికి వెళ్ళిందావిడ. శివనాథం వారపత్రిక తీసి మరోసారి వారఫలాలు చూశాడు అమ్మాయి నక్షత్రానికి ఖచ్చితంగా రాసి ఉంది. వివాహాది శుభకార్యాలు జరిగే సూచనలున్నాయి అని

"ఈ సంబంధం కుదిరిపోతే నీ దగ్గర కొచ్చి తలనీలాలు సమర్పించుకొంటాను స్వామీ...' అని అర్జంటుగా ఎదురుగ్గా ఉన్న వెంకటేశ్వరస్వామి పటానికి రహస్యంగా మొక్కేశాడు.

ఆ రాత్రి భోజనాలయినాక వీధిలో కొచ్చి అటూ ఇటూ పచార్లుచేస్తూ ఓ కన్ను గదివేపే పడేశాడు శివనాథం. ఆ కుఱ్ఱాడు గదిలో కూర్చుని రేడియో వింటూ ఏదో పత్రిక చదువుకొంటున్నాడు కుఱ్ఱాడిని చూస్తున్నకొద్దీ ముచ్చట పుట్టుకొస్తోంది శివనాథానికి. తన కూతురు శారదకు సరైనజోడు చిలకా గోరింకల్లా ఉంటారు.

"గురువుగారు ఏదో ఆలోచిస్తున్నట్లున్నారు!..." నవ్వుతూ అన్నాడు ఎదురింటి లింగమూర్తి భుజాన్న తుండు వేసుకొని వీధిలోకొస్తూ.

"ఆ! ఏముంటుంది? భోజనాలయినాయా?" అడిగాడు శివనాథం.

"ఇప్పుడే ముగించాం! అది సరేగాని సీతారామయ్య ఇంట్లో ఓ కుఱ్ఱాడు అద్దెకు దిగాడు చూశావా?"

"ఎప్పుడు? నాకు తెలీదే?" ఏమీ ఎరగనట్లు అబద్ధ మాడేశాడు శివనాథం

"ఎప్పుడో, ఏమో నాకు తెలీదుగానీ, ఇందాక ఆఫీసునుంచి వస్తూ చూశాను..."

"అలాగా..." చాలా మామూలుగా మాట్లాడాలని ప్రయత్నిస్తూ అన్నాడు శివనాథం. నాకు అనుమానమేమిటంటే- సీతారామయ్య ఏ ఉద్దేశ్యమూ లేకుండా ఆ కుఱ్ఱాడికి గది అద్దెకివ్వడని!...ఏమంటావ్?"

శివనాథం ఆశ్చర్యం నటిస్తూ లింగమూర్తివంక చూశాడు

"ఏమై ఉంటుందంటావ్ వాడి ప్లాను?"

"ఇంకే ముంటుందోయ్! ఎఱ్ఱగా, బుఱ్ఱగా వాడి కూతురు ఈకుఱ్ఱాడిముందు తిరుగుతూ కనబడితే, అమాంతం 'లవ్' చేసి, దమ్మిడీ కట్నంలేకుండా చేసు కొంటాడేమోనని..."

"అవునవును! వాడి కలాంటి ఆలో చనలు చాలా వున్నాయి. నీ అనుమానం నిజమే అయుండొచ్చు..."

"నిజమేనేమిటి నా శ్రాద్ధం! నిజం న్నరా! రాసిస్తానలా అని! అయినా నాకు తెలీకడుగుతాను, వాడికదేం బుద్ధోయ్! చుట్టూ పెద్దమనుషుల ఇళ్ల పెట్టుకొని, మధ్యలో ఈ తందనాలు! ఆ కుఱ్ఱవెధవ, గదిలో దిగి ఎంత సేపైం దంటావ్? మహా అయితే ఒక రోజు! అవునా? మరా సీతారామయ్యగాడి పెద్ద కూతురు, వాడితో మహా చనువున్నట్లు-వాడు ఇంట్లో మనిషయినట్లు, వసారాలో నిలబడి, వాడు చూస్తూండగా "నువ్వూ-నేనూ ఏకమైనాము..." అని సినిమా పాట పాడుతోంది..."

"అవ్వ..." నోరు నొక్కు కొన్నాడు శివనాధం.

లింగమూర్తి మరి కాసేపు సీతారామయ్య చేష్టల్ని తిట్టిపోసి, అమాయకు డయిన ఆ కుఱ్ఱాడిమీద జాలిపడి— నిద్రొస్తోందని ఇంట్లో కెళ్ళిపోయాడు.

అతనితో మాట్లాడింది చాలావరకూ నిరుపయోగమయినా, కొంతవరకు ముఖ్యమయిన సమాచారం శివనాధానికి దొరికిపోయింది. సీతారామయ్యే కాకుండా అతని కూతురు స్వయంగాకూడా ఆ కుఱ్ఱాడిని వలలో వేసుకోడానికి ప్రయత్నిస్తోంది. అంతేగాక అంతకంటె ముఖ్యమయిన విషయం ఏమిటంటే లింగమూర్తి కన్ను కూడా ఆ కుఱ్ఱాడి మీద పడింది. ఇక తను వాయువేగంతో పనులు పూర్తిచేసుకోపోతే ఆ అవకాశం కాస్తా వాళ్ళిద్దరిలో ఎవరొహాళ్ళుతన్నుకు పోతారు.

సీతారామయ్య కూతురు కొంతవరకు నయం "నువ్వూ-నేనూ ఏకమైనాము..." అన్న పాటల్తోనే సరిపుచ్చుకుంటోంది. లింగమూర్తి కూతురైతే ఏకంగా ఆకుఱ్ఱాడితో ఏకమయిపోతుంది-రెండో కంటికి తెలీకుండా! ఆ పిల్ల సంగతెవరకు తెలీదని? హైస్కూల్లో కొత్తగా చేరిన సైన్స్ టీచర్‌తో సరుగుడుతోటలోంచి బయటి కొస్తూ కనిపించలేదూ? ఊరందరకూ తెలుసా హరికథ! సిగ్గులేని వెధవ! అక్కడికి వీడో పెద్ద పతివ్రతయినట్లు సీతారామయ్యను తిడుతున్నాడు; ఇద్దరి కిద్దరే—కక్కుర్తి సన్యాసులు తిట్టు కొంటూ ఇంట్లోకి నడిచాడు శివనాధం.

ఆ రాత్రంతా నిద్రపోకుండా 'టీ' డికాషన్ తాగి మరీ ఆలోచించాడు శివనాధం ఆ కుఱ్ఱాడితో మాట్లాడటం ఎలా? వాళ్ళిద్దరూ 'నీ చుట్టూ వల పన్నే

...

స్తున్నా[రా నాయినా!' అని తెలియ జెయ్యడం ఎలా? పరువు ప్రతిష్ఠలు గల కుటుంబం, ఈ వీధిలో మా దొడ్డబేరా బాబూ అని ఋజువుచేయడం ఎలా — ఇవే ఆలోచనలు! మరోమూల అతని భార్యారత్నం కూడా నిద్రలేకుండా ఇలాంటి ఆలోచనల్తోనే సతమతమయి పోతోంది. ఆ కుఱ్ఱాణ్ణి ఇంటికి, ఏదో నెపంమీద పిలవాలి. పిలిచి సీతారామయ్యమీదా, అతని కూతురుమీదా ఉన్న వీ-లేనివీ చెప్పాలి. ఆనక అతని భార్య గయ్యాళితనం గురించి నచ్చజెప్పాలి.

భళ్లున తెల్లారిపోయింది.

శివనాథం బుర్రలోకూడా ఆలోచన మెరుపులా తళుక్కున మెరిసింది.

ఉదయం ఎనిమిదవుతోండగా శివనాథం కూతురు హైమావతి బ్రహ్మాండమయిన జపాన్ నైలాన్ ప్రింటెడ్ చీర కట్టుకొని, అదేరంగు జాకెట్ వేసుకొని, హంసలా నడుస్తూ సీతారామయ్య ఇల్లు చేరుకొంది వసారాలోనే నుంచుని గదిలోని ఆ కుఱ్ఱాడివంక చూస్తూ 'నువ్వూ నేనూ ఏకమైనాము' అని పాడుతున్న సీతారామయ్య కూతురు వసంత, హైమావతిని ఆ అలంకరణలో చూడగానే మొఖం మాడ్చేసుకొంది

"హలో వసంతా!" అంది హైమావతి వసారాలోకి నడిచి తనూ ఆ గదిలో రేడియోవింటున్న కుఱ్ఱాడివంక క్రీగంట చూస్తూ.

"లోపలకు పద! ఆ గదిలో మగాళ్లు అద్దెకున్నారు..." అంది వసంత ఆమెను ఇంచుమించుగా లోపలకు లాక్కెళ్తూ.

"ఎందుకొచ్చావు ఇప్పుడు?" అంది మొఖం చిట్లించుకొంటూ.

"మరేంలేదు-మేమే, మీకో చెంచాడు కాఫీపొడి ఇవ్వాలట–ఇచ్చేసి రమ్మంది మా అమ్మ..." అంది కర్చీఫ్‌లోనుంచి ఓ చిన్న పొట్లాం తీస్తూ. లోపల్నుంచి హడావుడిగా అక్కడికొస్తున్న సీతారామయ్య భార్య ఆ మాటలు వింటూనే మండిపడింది.

"నే నెవ్వరికీ చెంచాడు కాఫీపొడి అప్పివ్వలేదు - వెళ్ళు - మీ అమ్మతో చెప్పు..." అంది కరుగ్గా.

"సరే...కాసేపు వసంత దగ్గరే ఉంటాను! ఇంట్లో ఏమీ తోచటం లేదు..." అంది అక్కడే కుర్చీలో కూలబడుతూ.

"వసంతా! పోనీ నువ్వే వెళ్ళి కాసేపు వాళ్ళింట్లోనే కూర్చుని మాట్లాడుకోకూడదూ?" అందామె తల్లి.

"నే నిప్పుడు వెళ్ళనే అమ్మా! నాకు చాలా పనుంది! నువ్వెళ్ళవే హైమా! నాకు తీరిక దొరికినప్పుడు నేనే వస్తాలే. నువ్వు రాకిక్కడకు..." అంది అప్యాయత నటిస్తూ

'తప్పకుండా రావోయ్! మనం



మాట్లాకొని చాలా రోజులయింది..." అంది హైమావతి బయటకు నడవలేక నడుస్తూ.

వసంత ఆమెను సాగనంపటానికి గేటువరకూ వచ్చింది.

అక్కడ పూలుపూసిన చామంతి మొక్కను చూసేవంకతో నిలబడి ఆ గదిలో కుర్రాడితో చూపులు కలిపి "ఈ మొక్క చాలా పూలుపూసిందే!" అంది హైమావతి.

"అదెప్పుడూ అంతే—" విసుగ్గా అంది వసంత.

"వస్తా! మళ్లొస్తా..." అని సినిమా పాటలా అని వీలయినంత అందంగా నవ్వుతూ ఆ గదివేపు చూసి, ఆ కుర్రాడికే కనిపించేట్లు చేయి ఊపుతూ 'టాటా' అని బయల్దేరింది హైమావతి.

వసంత ఉక్రోషంతో రగిలిపోయింది.

'పత్తి బేవార్స్ రకం!...' అనుకొని మొఖమంతా చిరునవ్వు పులుముకొని గేటుదగ్గరే నిలబడి గదిలో కుర్రాడి వంక చూపులు విసుర్తూ "నువ్వూ-నేనూ ఏకమైనాము..." అంటూ ట్యూన్‌తో సహా అంటోంది ఉండుండి. పదవుతోందగా శివనాధం వీధి చివరి కిళ్ళీకొట్టుదగ్గర నిలబడి, ఎప్పుడూ లేంది ఓ మిఠాయి కిళ్ళీని నములసాగాడు.

అతని చూపులుమాత్రం సీతారామయ్య ఇంటివేపే ఉన్నాయి. సరిగ్గా పదయింతర్వాత ఆ గదిలోని కుర్రాడు టిప్ టాప్‌గా ముస్తాబయి చేతిలో ఓ లెదర్ బాగ్‌తో బయటి కొచ్చాడు. శివనాధం సర్దుకొని నిలబడ్డాడు 'ఎటెన్షన్' పొజిషన్‌లో.

అతను సరాసరి కిళ్ళీకొట్టు దగ్గర కొచ్చి 'ఓ పాకెట్ గోల్డ్‌ఫ్లాక్' అన్నాడు పదిరూపాయల నోటు విసిరేస్తూ

'అబ్బో! అబ్బో! చాలా డబ్బున్న వాడిలానే ఉన్నాడు...' అనుకొన్నాడు లోపల్లోపల కిల్లీకొట్టువాడు పాకెట్-చిల్లరా అందించా డతనికి ఓ సిగరెట్ తీసి నోట్లో పెట్టుకొని జేబులోనుంచి లైటర్ తీసి వెలిగించి నెమ్మదిగా ముందుకి నడిచాడు.

"మీరు...సీతారామయ్య గారింట్లో అద్దెకుంటున్నట్లున్నారు..." అతన్తో పాటు అడుగులువేస్తూ అన్నాడు శివనాధం.

"అవునండి." నమ్రతగా అన్నాడు కుర్రాడు.

"మరేంలేదు. ఈ వీధిలో కొత్తగా కనిపిస్తుంటేనూ-అనుమానం వచ్చింది నా పేరు శివనాధం—మీ గదికి నాలుగిళ్ళవతలే మా ఇల్లు! మీ పేరేమిటన్నారూ?"

"చంద్రకాంత్..." అన్నాడతను ముక్తసరిగా.

'అలాగా! చాలా సంతోషం!— న్వగ్రామం ఏది?"

"విశాఖపట్నం అనుకోండి! కాని మా వాళ్ళంతా హైద్రాబాద్‌లోనే స్థిరపడిపోయారు..."

"ఊహు!...ఇక్కడకు బదిలీమీద వచ్చారేమిటి?"

"అబ్బే! కాదండి! మా కంపెనీవాళ్లు ఈ ఊళ్ళో ఒక బ్రాంచీ పెట్టాలనుకొన్నారు. అందుకని సర్వేచెయ్యడానికి నన్ను పంపించారన్నమాట. బహుశా ఇక్కడ నేనే మానేజరుగా ఉండాలి కొంతకాలంపాటు..."

'అబ్బా!' అనుకొన్నాడు శివనాధం "ఏం కంపెనీ అండీ మీది?"

'ఎ-టు-జెడ్ డీలర్స్' అనీ, మా కంపెనీ 'డీల్' చెయ్యని వస్తువంటూ లేదనుకోండి! ఉత్తర హిందూస్థానంలో ఇప్పుడు మా కంపెనీయే లీడింగ్‌లో ఉంది. గుండుసూదు దగ్గరినుంచీ, ట్రాక్టర్లవరకూ అన్ని వస్తువులూ డీల్ చేస్తారు. మన ఆంధ్రప్రదేశ్‌లో కూడా బిజినెస్ విస్తరింపచేయాలని వాళ్ళ ప్రయత్నం. ఇంతకూ మీ రెక్కడ పని చేస్తున్నారు?..."

"తాలూకాఫీసులో గుమస్తాగా ఉంటున్నాను లెండి-ఏదో ఒక ఉద్యోగం-జీతం బత్తాలు సరిగ్గా లేకపోయినా ఉన్నాఊళ్ళో ఉద్యోగం మంచిదని ఉండిపోయాను..."

"అవునవును...అదే మంచిదండీ బాబూ! నా పరిస్థితి చూడండి! నెలకు తొమ్మిదొందలు సంపాయిస్తున్నాను. ఏం లాభం? సొంతూళ్లో ఉన్న సుఖం వేరు..."

"అమ్మో! తొమ్మిదొందలే..." లోపల్లోపలే గుండెలు బాదుకొన్నంత పనిచేశాడు శివనాధం.

"అవునవును!" అన్నాడు పైకి.

ఇద్దరూ మాట్లాడుకొంటూనే మెయిన్ రోడ్ దగ్గర కొచ్చేశారు

"సరే ఉంటాను!..." అన్నాడు చంద్రకాంత్

"మంచిదండీ...రోజూ కల్సుకొంటూనే ఉంటాంగదా ఇక..." అన్నాడు శివనాధం నవ్వుతూ.

"అవునవును..." అన్నాడు చంద్రకాంత్ కూడా నవ్వుతూ.

ఆ మర్నాడు చంద్రకాంత్ బయల్దేరే సమయానికి అదే కిళ్లీకొట్టుదగ్గర కలుసుకొన్నాడు శివనాధం.

"ఇవాళ ఎటువేపు వెళ్తున్నారేమిటి?" అడిగాడు శివనాధం నమ్రతగా

"ఇంకా డిసైడ్ చేసుకోలేదండీ! మార్కెట్ ప్రాంతం సర్వే ఇంకా పూర్తి కాలేదు ... అదే వెళ్ళాలనుకొంటు న్నాను..."

"మరింకేం-నేనూ అటే వస్తున్నాను పదండి..." అన్నాడు శివనాధం.

ఇద్దరూ నెమ్మదిగా నడిచి మెయిన్ రోడ్ మీదకు చేరుకొన్నారు. ఖాళీగా వెళ్తున్న రిక్షా పిలిచాడు చంద్రకాంత్.

"కూర్చోండి!" అన్నాడు శివనాధాన్ని చూస్తూ

"బేరమాడకుండానే?" ఆశ్చర్యంగా అడిగాడు శివనాధం.

"ఆ! ఎంతోకంత కంపెనీ మాకు జీతం కాకుండా ఇలాంటి తిరుగుడు కోసమని రోజుకి పద్దెనిమిది రూపాయ లిస్తుంది..."

"అబ్బా! లోలోపలే గుండెల బాదుకొన్నాడు శివనాధం. తొమ్మిదొందలు జీతంకాక ఇంకా రోజుకి పద్దెనిమిది రూపాయలా! బాబోయ్ ఎంత సంపాదన! ఎంత సంపాదన.

రిక్షా నెమ్మదిగా పోతోంది.

"చూడండి! మిమ్మల్ని చూస్తూంటే ఎంచేతో ఆప్తుల్ని చూసినట్లుంది. పాపం అందరికీ దూరంగా-ఆ పాడుహోటల్ కూడు తింటూ-ఎలా వుంటున్నారో ఏమో! — మీ కేమీ అభ్యంతరం లేకపోతే రాత్రికి మా ఇంటికి భోజనానికి రండి..."

"ఎందుకండీ - మీకు శ్రమ..." నవ్వుతూ అన్నాడతను

"అహహ! అలా అనకండి! చెప్పానుకదా! ఒకో మనిషినిచూస్తే అలా అభిమానం కలుగుతుంది! మాది చాలా పెద్ద వంశం లెండి! ఎంతో పేరు

ప్రఖ్యాతులున్నయ్. అసలు మాకు సరి పడేవాళ్ళు మా వీధిలో ఎవ్వరూ లేరు అయినాగాని, అంతకంటె మంచి ప్రాంతం దొరక్క అక్కడ ఉండి పోయాం!..."

"మీ ఇష్టం! మీరంతగా పట్టుపడు తూంటే కాదనలేను. కాని ఓ చిన్న రిక్వెస్ట్! నా కోసం స్పెషల్‌గా ఏమీ చెయ్యకండి! మీతోపాటూ నేనూనూ! నన్ను ఓ చుట్టంలా కాకుండా మీ ఇంట్లో ఒకడిగా చూడండి. అంతే నేను కోరు కొనేది..."

"అమ్మమ్మమ్మ! ఎంత మాట! మిమ్మల్ని బయటివారిలా ఎలా చూస్తాము? అలా అనుకొంటే అసలు మీదగ్గరకే రాను!..."

మార్కెట్లో ఆగింది రిక్షా తను ముందుగా దిగి డబ్బులిచ్చేశాడు చంద్ర కాంత్.

"అరెరె! మీ రెందుకిస్తున్నారు? నేను ఇచ్చేవాడినిగదా!..." అన్నాడు ఇబ్బందిపడిపోయినట్లు నటిస్తూ

"ఫరవాలేదు లెండి! ఎవరిస్తే ఏ ముందీ? మనలో మనకి..."

"ఔనౌను...అది నిజమే నను కోండి...మరి నేను శెలవు తీసుకోనా?– సాయంత్రం ఏడుగంటలకల్లా మా ఇంటికి రాగలరా?"

"ఓ! వస్తాను..."

"మరో చిన్న విషయం..." అంటూ అతని చెవిదగ్గరగా జరిగాడు శివనాథం.

"ఏమిటి?"

"మీరిలా మా ఇంటికి భోజనాని కొస్తున్న సంగతి సీతారామయ్యకేమాత్రం తెలీనీకండి! వాడసలే వట్టి బేవార్స్‌రకం...ఏవో లేనిపోనివి వాగు తాడు..."

"అలాగే...అలాగే..." నవ్వుతూ అన్నాడతను.

శివనాథం సరాసరి ఆఫీసుకెళ్ళి ఆ రోజు కాజువల్‌లీవ్ పెట్టేసి ఇంటికి చేరు కొన్నాడు.

"ఏమిటిప్పుడే వచ్చేశారు?" అందా యన భార్య.

"ఏముందీ?—మన పంట పండబో తోంది. ఆ కుర్రాడు సాయంత్రం మనింటికి భోజనానికి రావడానికి వప్పు కొన్నాడు..."

'నిజంగానేనా?"

"నూరుపాళ్లానూ! మన మంచే ఏమనుకొన్నావే!–నువ్వేమాత్రం ఓ పని చెయ్! అమ్మాయిని కొంచెం బాగా అలంకరించి మా ఇద్దరికీ అన్నం వడ్డించ డానికి నియోగించు! తెల్సిందా? నువ్వు కూడా అతివాగుడు వాక్కుండా–జాగ్ర త్తగా వళ్లు దగ్గరుంచుకొని మాట్లాడు!..."

"అవును–మాట్లాడ్డం ఇక ఇప్పుడు

నేర్చుకోవాలి-నేను...'' కోపంగా అందామె.

''అబ్బబ్బ! అదికాదే-అలాకోప్పడకు మరి-అబ్బాయి కొంచెం మితభాషి లాగున్నాడు. అందుకనే నీకింత గట్టిగా నొక్కి చెప్త...'' సర్ది చెప్పుకొన్నాడు శివనాథం.

''సాయంత్రం ఆరింటికల్లా వంట పూర్తయింది. నాలుగురకాల స్వీట్లు, హాట్లు తయారయినయ్. శివనాథం ఆరున్నరనుంచే వీధిలో నుంచుని ఎదురు చూడసాగాడు. శివనాథం కూతురు హైమావతి ఝూమ్మని అలంకరించుకొని ఇంకా ఏమేమో చూసుకొంటూ అద్దంముందు కూర్చుంది.

ఏడు గంటలకు లింగమూర్తి శివనాథం ఇంటివేపు వచ్చేడు. శివనాథానికి వళ్ళు మండిపోయింది.

ఈ వెధవ ఈ సమయానికే తగలడాలా? ఆ కుర్రాడు భోజనాని కొచ్చే సమయమయింది ఓ పక్క! ఈ సంగతి వీడికి తెలిసిందంటే ఊరంతా మార్మోగించేస్తాడు, అనుకొన్నాడు.

"ఏమిటి శివనాథంగారూ! ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్లున్నారు?''

"ఆ ఏముంది! తల నొప్పిగా ఉంటేనూ కాసేపలా తిరిగి ఇంట్లో కెళ్తున్నాను-ఇక వెళ్తాను."

"అబ్బ—అమ్మ—తలనొప్పి—ఛంపేస్తోంది..." అంటూ ఇంట్లోకి నడువబోయాడు.

''అరె! నా దగ్గర హోమియోపతి

మందుంది...తెమ్మంటారా?" అడిగాడు లింగమూర్తి

"అబ్బే! ఏమీ అవసరంలేదు కాసేపు నిద్రపోయిరేస్తే అదే సర్దుకొంటుంది... వస్తాను..." అంటూ లోనికి నడిచాడతను శివనాథం ప్రవర్తన ఎందుచేతో లింగమూర్తికి అనుమానం కలిగించింది. అందుకని ఓ కన్ను శివనాథం ఇంటి వేపే పడేసి పీదిలో కాపలా మొదలెట్టాడు.

సరిగ్గా ఏడున్నరకి చంద్రకాంత్ నెమ్మదిగా శివనాథం ఇంట్లోకి నడవడం-శివనాథం స్వయంగా బయటి కొచ్చి అతన్ని లోనికి ఆహ్వానించడం గమనించాడు లింగమూర్తి.

"అమ్మ రాస్కెల్-తల్నొప్పి అని వంకబెట్టి, తనను వదిలించుకొంది-ఇందుకా?'' అనుకొని మండిపడ్డాడు

''నా దగ్గర నా మాటలు చెప్పి-ఆ కుర్రాడిని తన కూతురికి కట్టెయ్యాలని ప్లానేస్తున్నాడు కాబోలు! నా కంఠంలో ప్రాణముండగా ఆ పెళ్ళి జరుగనీను-" అనుకొని భార్యతో రహస్య సమావేశం వెంటనే జరిపాడు.

శివనాథం ఇంట్లో చద్రకాంత్‌కి హేమలత ప్రతి నిమిషానికి ఓసారి స్నో పౌడరూ అద్దుకుంటూ భోజనం వడ్డిస్తోంది. శివనాథం భార్య మెల్లగా చద్ర కాంత్‌ని సంభాషణలోకి దించి వాళ్ళ వాళ్ళకి-తమకి - పదితరాలముందు చుట్టరికం ఉన్నట్లు ఋజువులు చూపించింది.

"అయితే నువ్వింకా కుర్రాడివి, అంచేత ఆ విషయాలు నీ కంతగా తెలీ" దంది చంద్రకాంత్ వప్పుకొన్నాడు.

హేమలత ఆ కుర్రాడిని "ఇంకేం కావాలండీ ?" అనడగడం చూసి "అండీ ఏమిటే పిచ్చిదానా! బావా అనలేవూ ? ఆ మాత్రం వరస తెలీదా !" అంటూ కోప్పడిందామె.

దాంతో హేమలత సిగ్గుతో మెలికలు తిరిగిపోతూ ఉండుండి అవసరమున్నా లేకపోయినా 'బావా' అనడం మొదలు పెట్టింది.

ఇది జరిగిన రెండుమూడు రోజులకు చంద్రకాంత్ లింగమూర్తి ఇంట్లో భోజనానికి వెళ్ళడం సీతారామయ్య కంటబడింది ఇది ఆయన ఏమాత్రం సహించలేకపోయాడు.

మర్నాడే చంద్రకాంత్‌ని కలుసుకొని "ఆ మాదల్లుడూ! మీ అత్తయ్య ఒకటే గొడవచేస్తోంది. నువ్వలా అడ్డమైనచోటా తిని ఆరోగ్యం చెడగొట్టుకొంటున్నావట! అందుకని ఇవాల్టినుంచీ మా ఇంట్లోనే భోజనం వగైరాలన్నీ చేయమని చెప్పింది. అంచేత నువ్వింక బయటెక్కడా తినకు! ఎంతా ఃస్యమైనాసరే తిన్నగా ఇంటికి ఇంటికి వచ్చేసెయ్" అన్నాడు.

"ఆ! ఎందుకండీ! మీకు శ్రమ!" అన్నాడు చంద్రకాంత్.

తలుపు వెనుకనుంచి సీతారామయ్య

భార్యగొంతు ఖంగునమోగింది. "క్రమేమిటి నాయనా! అయినవాళ్ళకి ఆ మాత్రం చేసుకోలేమేమిటి? అయినా నువ్వేమయినా ఐ.య టి వా ద వా ఏమన్నానా?"...

మూడు నెలలు గడిచిపోయినయ్. ఈలోగా చంద్రకాంత్ కంపెనీవాళ్ళు సమయానికి అతని జీతం పంపలేకపోవడంవల్ల సీతారామయ్య, లింగమూర్తి, శివనాధం తలో అయిదొందలూ ఒకరికి తెలీకుండా ఒకరు అతనికి అప్పుకూడా ఇచ్చారు.

"చెక్కు రాగానే...మీ డబ్బు మీకిచ్చేస్తాను..." అన్నాడు చంద్రకాంత్

"భలేవాడివేలే! పెద్ద మునిగిపోయిందేమిటిందులో!" అంటూ కోప్పడ్డారు వాళ్ళు. మరికొన్ని రోజులు గడిచినా చెక్కురాకపోయేసరికి "మా కంపెనీకి వెళ్ళి చెక్కు తెచ్చుకుంటా''నని చెప్పి ఉత్తరదేశం ప్రయాణం అయేడు చంద్రకాంత్. దారి ఖర్చులకని అందరూ తలో రెండొందలూ మళ్ళీఅప్పుగా ఇచ్చారతనికి.

"మీ ఋణం పెరిగిపోతోందే! కంపెనీలో కాష్ తీసుకోగానే టెలిగ్రామ్ మనిఆర్డరుద్వారా మీ డబ్బు మీకు పంపించేస్తాను..." అన్నాడు బయల్దేరేముందు.

"ఆ దాన్దేముందిలేస్తూ! నువ్వు తిరిగి ఇవ్వాలేమిటి? రేపు మా అమ్మాయిని చేసుకొన్నా ఇలాగే ఇచ్చిపుచ్చుకోడాలు ఉంటాయా ఏమిటి?" అన్నారుభలోక్తిగా వాళ్ళు.

అతను వెళ్ళిన నెల్రోజుల తర్వాత ముగ్గురికీ మూడు ఉత్తరాలొచ్చినయ్. మూడింటిలోనూ విషయం ఒక్కటే.

"శివనాధంగారు, లింగమూర్తిగారు, సీతారామయ్యగారు, మీ ముగ్గురి ఆదరణ నేను మరచిపోలేను. నన్ను మీ ఇంట్లో ఒకడిగా చూసుకొన్నారు. మీకు ఎప్పటికీ కృతజ్ఞుడిని! నాలాంటి వాడిని మొదటం బహుశా మీకు కొత్త అనుకుంటాను. కాని మీలాంటి 'ఆడపిల్లల' తండ్రుల్ని నేను చాలామందిని చూశాను. ఇంచుమించుగా వాళ్ళందర్నీ వాళ్ళ బలహీనతని కనిపెట్టి మోసం చేశాను. అలా మోసం చేయడం తప్పని నాకు తెలుసు. కాని ఏంచేయను? నిరుద్యోగం! తిండానికి తిండిలేని పరిస్థితి! ఈ పద్ధతిలో నాకు మంచి భోజనమూ, గౌరవమూ, డబ్బూ దక్కటమే కాకుండా, అందమయిన ఆడపిల్లలు 'బావా' అంటూ ప్రేమగా పిలుస్తున్నారు. అంచేత గడిచిన న్నాళ్ళు ఇలాగే పొట్ట నింపుకొడలచుకొన్నాను. ప్రస్తుతం మరో చోట మీలాంటి ఆడపిల్లల తండ్రిదగ్గర ఉంటున్నాను. పోలీస్ రిపోర్టివ్వకండి! అందుమూలాన ఎక్కువ నష్టం కలిగేది మీ అమ్మాయిలకే! మీ కందరకూ మరోసారి కృతజ్ఞత లర్పిస్తూ మీ అల్లుడు చంద్రకాంత్." ఉత్తరం చదివి మంచి పడుతూ అకుర్రాడి గదితలుపులు పగలగొట్టి చూశాడు సీతారామయ్య. గదంతా ఖాళీ!